


రంజాన్ వేళలు
ఇఫ్తార్ సాయంత్రం గంటల 6.23(సోమవారం)
సహేరీ ఉదయం గంటల5.02 (మంగళవారం)

ఇక సమరమే..!

- అభ్యర్థుల ఖరారుతో జిల్లాలో పెరిగిన ఎన్నికల వేడి
- అడ్డదారిలో గెలిచేందుకు వైసీపీ సిద్ధం
- కుయుక్తులను తిప్పికొట్టేందుకు టీడీపీ సంసిద్ధం







నంద్యాల, మార్చి 17 (ఆంధ్రజ్యోతి):
ఎన్నికల షెడ్యూల్ వచ్చేసింది. జిల్లాకు సంబంధించిన ఎంపీ టికెట్ మినహా అసెంబ్లీ స్థానాల అభ్యర్థులను టీడీపీ ఖరారు చేసింది. షెడ్యూలు విడుదల రోజే వైసీపీ కూడా జిల్లాలోని ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించింది. దీంతో జిల్లాలో ఒక్కసారిగా ఎన్నికల వేడి మొదలైంది. ఏ సీట్లలో తమకు ఎవరు పోటీనో తేలిపోవడంతో అటు అధికార పార్టీ, ఇటు ప్రతిపక్ష టీడీపీ తమ వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ఎన్నికలకు ఇంకా రెండు నెలల సమయం ఉండటంతో ఇప్పటి నుంచే మెజారిటీ ఎలా పెంచుకోవాలి అన్నదానిపై పథక రచన చేస్తున్నారు. వైసీపీ అడ్డదారిలో గెలిచేందుకు ప్రయత్నిస్తుండగా.. ప్రజా వ్యతిరేకతను ఒడిసి పట్టుకుని గెలుపు తీరాలకు చేరుతామన్న ధీమాను టీడీపీ వ్యక్తం చేస్తోంది. ఏదేమైనా మరో రెండున్నర నెలల్లో నేతల భవిష్యత్తు తేలిపోనుంది.

వైసీపీలో అంతర్మథనం



వైసీపీలో స్థానిక నాయకులపైన ఎంత వ్యతిరేకత ఉన్నా.. అధిష్ఠానం మాత్రం సిట్టింగ్‌లను మార్చదన్న అభిప్రాయం మొదట్నుంచీ వ్యక్తమవుతూనే ఉంది. నందికొట్కూరు నియోజకవర్గం మినహాయించి అన్ని స్థానాల్లోనూ మళ్లీ సిట్టింగ్‌లనే ఆ పార్టీ అభ్యర్థులుగా ప్రకటించింది. ఈ విషయంపై సమాచారం ఉండటంతో ఆయా అభ్యర్థులు తమ వ్యతిరేకతను తగ్గించుకునేందుకు అడ్డదారులు తొక్కడం మొదలుపెట్టారు. వలంటీర్లను మచ్చిక చేసుకునేందుకు డబ్బులు పంచడం, అధికారిక గ్రూపుల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిపై విషప్రచారం చేయడం, అబద్ధపు ప్రచారాలు చేయడం మొదలుపెట్టారు. అయితే వలంటీర్లను ఎన్నికల విధుల్లో ఉపయోగించుకూడదంటూ ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశం వైసీపీ నాయకులకు ఆశనిపాతంలా మారింది. ఇపుడు వారందరికీ ఇచ్చిన తాయిలాల ఖర్చు వృథాయేనా అన్న అంతర్మథనంలో పడిపోయారు. డబ్బులు పంచిన వారి పరిస్థితి ఇలా ఉంటే.. డబ్బులు పంచని వారి పరిస్థితి మరోలా ఉంది. ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీరు ఉంటాడు కాబట్టి, ప్రభుత్వం మారితే పథకాలు రావని బెదిరించడం, ఎన్నికల వేళ ఓటర్లను ప్రలోభపెట్టవచ్చనుకున్నది కాస్తా తారుమారు కావడంతో ఒక్కసారిగా ఆయానేతలకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. ఇక కోడ్ వచ్చేసిన తర్వాత ఎన్నికల కమిషన్ అన్ని విషయాల్లో సీరియస్‌గా ఉంటుంది కాబట్టి తమ ఆటలు ఏమేరకు సాగుతాయోనన్న అనుమానంలో కూడా వైసీపీ నేతలు ఉన్నారు.

అబద్ధపు ప్రచారాలతో మభ్యపెట్టేందుకు

ఎన్నికలనగానే ఒక పార్టీ మీద ఇంకో పార్టీ విమర్శలు చేసుకోవడం సహజం. అయితే వైసీపీ ఆ విమర్శలతో పాటు అబద్ధపు ప్రచారాలు చేసేందుకు కూడా సిద్ధమైంది. సాక్షాత్తు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అబద్ధపు ప్రచారాలు, మభ్యపెట్టే మాటలు చెప్పడం గమనార్హం. మొన్నటి బనగానపల్లె ఈబీసీ నేస్తం సభలో ఈ అబద్ధపు ప్రచారాలు ఆకాశాన్ని తాకాయి. అదే సమావేశంలో బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ 'ఇక్కడ నాపరాతి పరిశ్రమలు ఎక్కువగా ఉన్నాయి. మన ప్రభుత్వం వచ్చాక రాయితీ ఇవ్వాలి' అని సీఎం జగన్‌ను కోరారు. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతే ఇక్కడి నాపరాతి పరిశ్రమపై భారం పెరిగింది. గత టీడీపీ ప్రభుత్వం చదరపు అడుగుకు రూ.8గా ఉన్న రాయల్టీని రూ.5కి తగ్గించింది. అలాగే 30 శాతం ఉన్న డీఎంఎఫ్‌ను 10 శాతానికి తగ్గించింది. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చాక చదరపు అడుగుకు రూ.5గా ఉన్న రాయల్టీని రూ.6కు పెంచడమే కాకుండా, రూ.40 వేలు ఉన్న డెడ్‌రెంట్ (వార్షిక బాడుగ)ను రూ.52 వేలకు పెంచింది. ఇక డెడ్‌రెంట్‌ను పది రెట్లు అంటే రూ.5.20లక్షలు కడితే గానీ రాయల్టీ బిల్లులు ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం వేధించింది. ఇన్నాళ్లు ఉన్నది తమ ప్రభుత్వమే అయినా నాపరాతి పరిశ్రమపై భారం ఎందుకు వేశారో మాత్రం కాటసాని చెప్పలేకపోయారు. సామాన్యులకు ఇవన్నీ తెలియదన్న ఉద్దేశంతో వైసీపీ నాయకులు అడ్డూ అదుపు లేని అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారు. ఇలాంటి అసత్యాలను ప్రజలకు తెలియజేసి, వైసీపీ చేస్తున్న మోసమేమిటో అర్థమయ్యేలా చెప్పేందుకు టీడీపీ నాయకులు సన్నద్ధమవుతున్నారు. ఈ సారి ఎన్నికలు పూర్తిగా అబద్ధానికి, నిజానికి జరిగే పోరాటంగా టీడీపీ నాయకులు అభివర్ణిస్తూ ప్రజల్లోకి వెళ్తున్నారు.

టీడీపీలో జోరు..




టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి పొత్తులకు క్షేత్రస్థాయిలో జనామోదం లభించడంతో జిల్లాలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు రెట్టించిన ఉత్సాహంతో ఉన్నారు. ఇక మరోవైపు ఇన్ని రోజులు వైసీపీలో ఉన్న ఉమ్మడి జిల్లా కీలక నేతలు టీడీపీ బాట పడుతున్నారు. ఇటీవల ఆలూరు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, రెండు రోజుల కిందట కర్నూలు ఎంపీ సంజీవ్ కుమార్ వంటివారు టీడీపీ కండువా కప్పుకున్నారు. ఇక నంద్యాల జిల్లాలోని పలువురు వైసీపీ నాయకులు కూడా టీడీపీ తీర్థం పుచ్చుకుంటున్నారు. ఇలా ఓ వైపు పార్టీ కార్యక్రమాలు, అభ్యర్థుల ప్రచారంలో దూసుకుపోతుంటే, మరో వైపు టీడీపీలోకి చేరికలతో పార్టీలో ఉత్సాహం ఉరకలేస్తోంది.

ఐదేళ్లలో అభివృద్ధి నిల్..

ఒక్క అవకాశం అంటూ అధికారంలోకి వచ్చిన వైసీపీ.. ఈ ఐదేళ్లలో చేసిందేమీ లేదు. ఇక జిల్లాకు కూడా ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరిగిన దాఖలాలు లేవు. దీనికి తోడు జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలోనూ అధికార పార్టీ నాయకులు ఆగడాలు, అక్రమాలు పెరిగిపోయాయి. మట్టి, ఇసుక, గ్రావెల్ మాఫియాతో పాటు విలువైన ప్రభుత్వ భూములను కొట్టేసేందుకు పథక రచన చేయడం వంటివి హెచ్చుమీరాయి. కొన్ని చోట్ల అయితే భూములు ఇతరుల పరం కూడా అయ్యాయి. ఇలా ఐదేళ్లలో అభివృద్ధి మాట ఏమోగానీ పూర్తిస్థాయి విధ్వంసాన్ని వైసీపీ నాయకులు సృష్టించారు. ఈ స్థాయి వ్యతిరేకతను వైసీపీ నాయకులు కూడా ఊహించలేదు. ఇక ఇదే అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకుని టీడీపీ నాయకులు ప్రజల్లోకి వెళ్తున్నారు. ఇప్పటికే వైసీపీ చేసిన ఆగడాలు ఏమిటి? టీడీపీ వస్తే అభివృద్ధి, సంక్షేమం రెండిటినీ ఎలా సమపాళ్లలలో అందిస్తుందో వివరిస్తున్నారు. ఇక టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు నంద్యాలకు మీటింగ్‌కు వచ్చిన సమయంలోనే అరెస్టు కావడం కూడా జిల్లా ప్రజల్లో టీడీపీకి సానుభూతి పెరిగేలా చేసింది.

నేటి నుంచి 'పది' పరీక్షలు

- జిల్లా వ్యాప్తంగా 134 కేంద్రాలు
- పరీక్షలు రాయనున్న 30,242 మంది విద్యార్థులు
- ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం



నంద్యాల (నూనెపల్లె), మార్చి 17: పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి మొదలవుతున్నాయి. ఇప్పటికే అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షలు ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:45 వరకు జరుగుతాయి. విద్యార్థులకు కేటాయించిన పరీక్షా కేంద్రాలకు గంట ముందే చేరుకోవాలి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 134 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా, అందులో ఏ కేటగిరి పరీక్షా కేంద్రాలు 62, బీ కేటగిరిలో 57, సీ కేటగిరిలో 15 ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 30,242 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 24,223 మంది, ప్రైవేటు విద్యార్థులు 6,019 మంది ఉన్నారు. పరీక్షల నిర్వహణకు 134 మంది చీఫ్ సూపరిండెంట్లు, 134 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, 32 మంది అడిషనల్ డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలతో పాటు 1750 మంది ఇన్విజిలేటర్లు విధుల్లో పాల్గొంటున్నారు. పరీక్షల పర్యవేక్షణకు ఆర్‌ఎస్ గంగాభవాని నియమితులయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని డీఈవో సుధాకర్‌రెడ్డి వెల్లడించారు. పరీక్షలు రాసే విద్యార్థులు తమ హాల్‌టికెట్లను చూపించి ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని తెలిపారు. విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని డీఈఓ పిలుపునిచ్చారు.

పటిష్ట బందోబస్తు : ఎస్పీ రఘువీర్ రెడ్డి

నంద్యాల క్రైం: పదో తరగతి పరీక్షల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల నిర్వాహకులు, సిబ్బంది, పోలీస్ సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు.

మంత్రాలయంలో కిక్కిరిసిన భక్తులు

మంత్రాలయం, మార్చి 17: మంత్రాలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. రాఘవేంద్ర స్వామి దర్శనార్థం ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు రావడంతో శ్రీమఠం ప్రాంగణం నిండిపోయింది. అన్నపూర్ణ భోజనశాల, మహా ముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదితీరం భక్తులతో కోలాహలంగా మారింది. భక్తులు గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. రథోత్సవాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు పీఠాధిపతులు సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులు పొందారు.

'గురువైభోత్సవాలు విజయవంతం'

ఈ నెల 11 నుంచి 16వ తేదీ వరకు రాఘవేంద్రస్వామి గురు వైభోత్సవాలు శ్రీమఠం అధికారులు, అనధికారులు, గ్రామస్థులు, భక్తుల సహకారంతోనే విజయవంతం అయ్యాయని మఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉత్సవాల్లో ముఖ్యమైన రోజులు 12వ తేదీన 403వ స్వామివారి పట్టాభిషేకం, 16న రాఘవేంద్రస్వామి 429 పుట్టిన రోజు వేడుకలు మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో వైభవంగా జరిగాయని తెలిపారు.



మంత్రాలయం మఠం ప్రాంగణంలో భక్తుల రద్దీ

ప్రశాంతంగా గ్రూప్-1 పరీక్ష

జిల్లాలో 1373 మంది గైర్హాజరు



నంద్యాలలోని గ్రూప్-1 పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీనివాసులు

నంద్యాల (నూనెపల్లె), మార్చి 17 : ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన గ్రూప్ -1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్ష జరిగింది. పరీక్షలకు 3675 మంది అభ్యర్థులకుగాను 2302 మంది హాజరయ్యారు. 1373 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు అధికారులు పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణకు ఏడుగురు లైజన్ ఆఫీసర్లు (జిల్లా స్థాయి సీనియర్ అధికారులు), ఏడుగురు చీఫ్ సూపరిండెంట్లను నియమించారు. జిల్లా కేంద్రంలోని పరీక్షా కేంద్రాలను కలెక్టర్ శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి, ఎస్పీ రఘువీర్‌రెడ్డిలు తనిఖీలు చేశారు. పరీక్షా కేంద్రాలలోని వసతులను పరిశీలించారు.

పాణ్యం: మండలంలోని ఆర్జీఎం, శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలల్లో జరిగిన గ్రూప్-1 పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. ఆర్జీఎంలో 696 మందికి గాను 421 మంది, శాంతిరాం కళాశాలలో 600 మందికి గానూ 274 మంది అభ్యర్థులు హాజరైనట్లు కంట్రోల్ ఎగ్జామినర్ డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఓ అభ్యర్థి 9:50 గంటలకు రావడంతో అనుమతించలేదు.



శాంతిరాం కళాశాల వద్ద అభ్యర్థుల హాల్‌టికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

అడుగంటుతున్న సప్తనదీ తీరం

నీరు లేక వెలవెలబోతున్న సప్త సంగమ ప్రాంతం



సంగమేశ్వరం వద్ద ఒట్టిపోయి కనిపిస్తున్న నది

కొత్తపల్లి, మార్చి 17: ఎండలు మార్చి నెలలోనే దారెత్తిస్తున్నాయి. దీంతో భూగర్భజలాలు అడుగంటుతున్నాయి.. సప్తనదుల సంగమేశ్వరం వద్ద శ్రీశైలం రిజర్వాయరులో నీరు రోజురోజుకూ తగ్గుముఖం పడుతున్నాయి. శ్రీశైలం రిజర్వాయరు పరివాహక ప్రాంతాల్లోని సంగమేశ్వరం, జానాల, బలపాలతిప్ప, సిద్ధేశ్వరం తదితర ప్రాంతాల్లో చేపలు పట్టే మత్స్యకారులు చేపల వేటకు స్వస్తి చెబుతున్నారు. మరికొందరు మూటాముళ్ల సర్దుకుని తమ స్వగ్రామాలకు వెళ్తున్నారు. భానుడి ఉగ్రరూపానికి మూగజీవాలు, పక్షులు సైతం నీరు లేక విలవిల్లాడుతున్నాయి. సంగమేశ్వరం వచ్చే భక్తులకు పుణ్యస్నానాలకు కూడా ఇబ్బందికరంగా మారింది. మార్చిలోనే ఇలా ఉంటే.. మే నెల వరకు ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికల కోడ్‌ను కట్టుదిట్టంగా అమలు చేయాలి

నంద్యాల (నూనెపల్లె), మార్చి 17: భారత ఎన్నికల సంఘం సాధారణ ఎన్నికల షెడ్యూల్ వెలువరించడంతో ఎన్నికల ప్రవర్తన నియమావళి(కోడ్)ని కట్టుదిట్టంగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. ఆదివారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్వో పద్మజ పాల్గొన్నారు. అనంతరం రిటర్నింగ్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలతో కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో మోడల్ కోడ్ ఆఫ్ కండెక్ట్ అమలును పటిష్ఠంగా చేయాలని, ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా సంబంధిత అధికారులను ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. సీవిజిల్ యాప్ ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, యాప్ నుంచి వచ్చే ఫిర్యాదులకు 100 నిమిషాల్లో పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎస్‌సీసీ, ఎఫ్ఎస్‌టీ టీమ్‌లు పర్యటించేందుకు సోమవారం ఉదయంలోగా వాహనాలను అందుబాటులో ఉంచాలని డీటీఏను ఆదేశించారు. ఈ బృందాలు క్షేత్ర స్థాయిలో విస్తృతంగా పర్యటించాలని, గ్రామ పంచాయతీలు, సచివాలయాలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలపై ఉన్న రాజకీయ పార్టీలకు చెందిన బ్యానర్లు, పోస్టర్లు, స్టిక్కర్లు, ఫొటోలను, ఇతర క్యాలెండర్లను, జెండాలను తొలగించాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్, ఏపీఎస్పీడీసీఎల్, ఎగ్జిక్యూటివ్ ఆన్ గోయింగ్ వర్క్‌లు మినహా కొత్తపనులు ఏమీ చేయవద్దని సూచించారు. ప్రస్తుతం జరుగుతున్న పనుల జాబితాను సోమవారం సాయంత్రంలోగా అందజేయాలని ఆదేశించారు.

హంస వాహనంపై
జ్వాలా నరసింహ స్వామి



హంస వాహనంపై జ్వాలా నరసింహస్వామి

ఆళ్లగడ్డ, మార్చి 17: హంస వాహనంపై జ్వాలా నరసింహ స్వామి విహరించి ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. అహోబిలం లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఎగువ అహోబిలంలో మూడో రోజు జ్వాలా నరసింహ స్వామి హంస వాహనంపై విహరించారు. జ్వాలా నరసింహస్వామి హంస వాహనంపై విహరించడమంటే పాలలోని నీటిని వేరు చేసి మంచి చెడుల తేడాలను భక్తులకు తెలియజేయడమేనని వేద పండితులు చెప్పారు. ముందుగా ఎగువ అహోబిలంలో జ్వాలా నరసింహస్వామికి అభిషేకం నిర్వహించారు. ఆ తరువాత స్వామి వారు సూర్యప్రభ వాహనంపై విహరించారు.

దిగువ అహోబిలంలో..

అహోబిలం లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఉదయం ధ్వజారోహణం, మధ్యాహ్నం అభిషేకం, సాయంత్రం భేరి పూజ కార్యక్రమాలను భక్తుల సమక్షంలో నిర్వహించారు. రాత్రి ప్రహ్లాద వరద స్వామి సింహ వాహనంపై విహరించారు.

స్వర్ణ కవచాలు బహూకరణ

ప్రహ్లాద వరదస్వామి స్వర్ణ కవచాలకు మరమ్మతులు చేసి వాటిని తిరిగి స్వామి వారికి పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్ ఆదివారం బహూకరించారు. అలాగే అమృత వల్లి అమ్మవారి స్వర్ణ కవచాలను పరిశీలించారు.

నేడు ఎగువ అహోబిలంలో..

ఎగువ అహోబిలంలో సోమవారం ఉత్సవం, అభిషేకం, హనుమంత వాహనంపై విహరిస్తారు. దిగువ అహోబిలంలో ప్రహ్లాదవరద స్వామిని హంస వాహనం, అభిషేకం, సూర్యప్రభ వాహనం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తారు.




తొడగొడుతున్న యువతి..


పల్నాడు జిల్లా బొప్పూడి ప్రజాగళం సభకు హాజరైన జనం


ప్రజాగళం సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు, మోదీ, పవన్


ప్రజాగళం సభకు వస్తున్న అమరావతి మహిళలు



ప్రజాగళం.. ప్రభంజనం




ప్రజాగళం సభలో మూడు పార్టీల అభిమానులు

జనం జనం ప్రభంజనం.. బొప్పూడి ప్రజాగళం జనసంద్రమైంది. ఆదివారం భానుడు భగభగ మండిస్తున్నా తగ్గేదిలేదన్నట్లుగా తరలివచ్చిన అశేష జనం హర్షాతిరేకాలతో బొప్పూడి సభా ప్రాంగణం దద్దరిల్లింది. బొప్పూడికి ఇటు చిలకలూరిపేట, అటు మార్టూరు వరకు 16వ నెంబరు జాతీయ రహదారి జనంతో నిండిపోయింది. యువకులు వృద్ధులు, మహిళలు పిల్లలు అన్న తేడా లేకుండా అన్ని వర్గాల వారు కూటమి జెండాలు చేబూని బొప్పూడి వైపు కదలిరావడంతో జాతీయ రహదారిపై జన సునామీ ఆవిష్కృతమైంది. చలో బొప్పూడి అంటూ కార్యకర్తలు, నేతలు, అభిమానులు ఒక ప్రవాహంలా తరలిరావడంతో మధ్యాహ్నం మూడు గంటలకే సభా ప్రాంగణం మొత్తం జనంతో కిటకిటలాడింది. జనసునామీని చూసిన అధినేతలు ఆనందపరవశులయ్యారు. మోదీ అయితే చంద్రబాబును ప్రత్యేకంగా అభినందించారు. బొప్పూడి వేదికగా త్రిమూర్తులైన ప్రధాని నరేంద్రమోదీ, టీడీపీ, జనసేన అధి నేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఎన్నికల శంఖారావం పూరించారు. అభివృద్ధి లేక అప్పులు.. దోపిడీ దాష్టీకాలు.. అవినీతి అప్రజాస్వామిక పాలనను అంతం పలకాలని నేతలు పిలిపిచ్చారు. జెండాలు వేరైనా అజెండా ఒకటేనని.. అభివృద్ధి, సంక్షేమం, ప్రజాస్వామ్య పరిరక్షణ కావాలంటే కూటమికి ఓటేసి ఆశలు, ఆకాంక్షలు, సాకారం చేసుకోవాలని సందేశమిచ్చారు.

- చిలకలూరిపేట


ఉత్సాహంగా యువతులు..


బాబు,పవన్, పురంధేశ్వరి అభివాదం...


మోదీతో బాబు మాటామంతీ..


జానపదుల నృత్యాలు..


మహిళలు, కార్యకర్తల ఉత్సాహం..





స్పందన రద్దు

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 17: కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడం వల్ల స్పందన కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ డా.జి.సృజన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలో డివిజన్ స్థాయిలో, మున్సిపాలిటీ పరిధిలో, మండల స్థాయిలో కూడా స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నామని చెప్పారు.

గ్రూప్-1 పరీక్ష కేంద్రాల తనిఖీ


నంద్యాలలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

నంద్యాల క్రైం, మార్చి 17: గ్రూప్-1 పరీక్ష కేంద్రాల వద్ద ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి నేతృత్వంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. నంద్యాల పట్టణంలో ఏర్పాటు చేసిన గ్రూప్-1 పరీక్షా కేంద్రాలైన నేషనల్ డిగ్రీ కాలేజీ, రామకృష్ణ పీజీ కాలేజీ, గుడ్‌షెపర్డ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ తదితర కేంద్రాలను ఆదివారం ఎస్పీ తనిఖీ చేశారు. అనంతరం ఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ గ్రూప్-1 రాత పరీక్షలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా అన్ని కేంద్రాలవద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని చెప్పారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి వారి నుంచి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు స్వాధీనం చేసుకున్న అనంతరమే కేంద్రాలలోకి అనుమతించా మని చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమలు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల చుట్టుపక్కల ఉండే జిరాక్స్ సెంటర్లను మూసివేయించామని తెలిపారు. పరీక్ష పూర్తయ్యేవరకు పరీక్షా కేంద్రాల సిబ్బంది, పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించామని చెప్పారు. గ్రూప్-1 పరీక్షల సందర్భంగా ఎవరైనా అక్రమాలకు పాల్పడినట్లు తేలితే అలాంటివారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

ఉన్నత విద్యా మండలి చైర్మన్‌పై

చర్యలు తీసుకోవాలి

- కోడ్ వచ్చినా వెబ్‌సైట్‌లో సీఎం, మంత్రుల ఫొటోలా..?
- రాయలసీమ విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ చైర్మన్

కర్నూలు(అర్బన్), మార్చి 17: కేంద్ర ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ఉన్నత విద్యామండలి వెబ్‌సైట్‌లో సీఎం, మంత్రులు ఫొటోలను అలాగే కొనసాగిస్తున్న చైర్మన్ హేమచంద్రారెడ్డిపై చర్యలు తీసుకోవాలని రాయలసీమ విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ చైర్మన్ బీ శ్రీరాములు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్ తక్షణమే వెబ్‌సైట్‌లో, ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ నాయకుల ఫొటోలను తొలగించాలని ఆదేశాలు ఉన్నప్పటికీ తుంగలో తొక్కారని మండి పడ్డారు.ఉన్నత విద్యామండలి చైర్మన్ వైసీపీకి ఏజెంట్‌లాగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కోడ్ అమలులో ఉండగా వైసీపీకి నుకూలంగా వీడియోలను విడుదల చేయడం ఎన్నికల కమిషన్ నిబంధనలకు విరుద్ధం అన్నారు. చైర్మన్‌పై ఉన్న విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి శ్యామాలరావు స్పందించకపోవడం దారుణమన్నారు. తక్షణమే హేమచంద్రరెడ్డిపై కఠిన చర్యలు తీసుకోని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు

- పరిమళ ప్రశస్తి-2024 అవార్డుల ప్రదానం
- అవార్డు అందుకున్న ఐటీ నిపుణుడు భానుశంకర్


ఐటీ నిపుణుడు కురువ భానుశంకర్‌కు పరిమళ ప్రశస్తి అవార్డును ప్రదానం చేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, మార్చి 17: వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన పలువురికి పరిమళ ప్రశస్తి-2024 అవార్డులను శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆదివారం రాత్రి అందజేశారు. మంత్రాలయం గురు రాఘవేంద్రస్వామి మఠం యోగీంద్ర కళా మండపంలో పరిమళ ప్రశస్తి అవార్డులను పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ప్రదానం చేశారు. సామాజిక సేవలు, ఐటీ రంగంలో కురువ భానుశంకర్ విశేష కృషి చేశారు. అదేవిధంగా కేంద్ర మంత్రిత్వ శాఖ, హర్యాణా రాష్ట్ర గవర్నర్ సలహాదారునిగా సేవలందిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన చేసిన సేవలను బెంగళూరుకు చెందిన గురుదత్తు కమిటీ గుర్తించింది. అందులో భాగంగానే ఆదివారం రాత్రి యోగీంద్ర కళామండపంలో పరిమళ ప్రశస్తి-2024 అవార్డును ఆయనకు పీఠాధిపతి అందజేశారు. అవార్డుతో పాటు రాఘవేంద్రస్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షింతలు, పరిమళ ప్రసాదం ఇచ్చి పీఠాధిపతి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక సినీ నటుడు రమేష్ అరవింద, మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషి, శ్రీపతాచార్, ఐవీ నరసింహమూర్తి, అనంతపురాణిక్, డీఎం ఆనందరావు, ఈఈ సురేష్ కోనాపూర్, ఏఈ బద్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి గోరంట్ల మాధవుడి తిరుణాల

- 26న అర్ధరాత్రి కల్యాణం
- 30న శ్రీవారి రథోత్సవం


శ్రీదేవి భూదేవి సహిత లక్ష్మీమాధవస్వామి

కోడుమూరు(రూరల్), మార్చి 17: మండలంలోని గోరంట్ల లక్ష్మీమాధవ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 22వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ ఈవో గుర్రెడ్డి, చైర్మన్ అరవ నారాయణ తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ ఈ వేడుకలు 11 రోజుల పాటు జరుగుతాయన్నారు. ఈనెల 22న ఉత్సవాలకు అంకురార్పణ, రక్షాబంధనం, 23న ధ్వజారోహణం, భేరి పూజ, సింహోత్సవం, 24న శేషోత్సవం, 25న హనుమంతోత్సవం, 26న శ్రీవారి కల్యాణం, గరుడోత్సవం (అర్ధరాత్రి అనంతరం), 27న గజోత్సవం, 28న శిభికోత్సవం, 29న రథారోహణం, 30న శ్రీవారి రథోత్సవం, 31న పారువేట ఏప్రిల్ 1న చక్రస్నానం, వసంతోత్సవం, కంకణ విసర్జనతో ఉత్సవాలకు ముగింపు పలకనున్నట్లు తెలిపారు. ఇక్కడ వ్యవసాయ సామగ్రితోపాటు ఎద్దుల విక్రయాలు జరుగుతాయి. ఈప్రాంతంలో రైతుల తిరుణాలగా పిలుచుకుంటారు.

నాగమ్మ హత్య కేసులో మరో ఇద్దరు అనుమానితులు


నాగమ్మ(ఫైల్)

గోనెగండ్ల, మార్చి 17: గోనెగండ్ల మండలం పెద్దమరివీడు గ్రామంలో కురువ నాగమ్మను మనవడు హత్య చేసి ఆమె పైన ఉన్న బంగారం దొంగలించి ఇంటి ఆవరణలోనే శవాన్ని పూడ్చి వేసి సెల్‌ఫోన్ కొనుకున్న సంఘటన పాఠకులకు విదితమే. అయితే కురువ వెంకటేష్ అనే యువకుడే నాగమ్మను హత్య చేసి రాత్రి ఇంటి అవరణం నందే గుంత తవ్వి పూడ్చడం ఒక్కడికే సాధ్యమయ్యే పనేనా అనే అనుమానాలు గ్రామంలో వ్యక్త మవుతున్నాయి. వెంకటేష్‌తోపాటు గ్రామంలో మరికొందరిని విచారించడంతో మరో ఇద్దరి యువకులపై అనుమానాలు వచ్చాయి. దీంతో హత్య చేశానని పోలీసులు ముందు ఒప్పుకున్న వెంకటేష్‌తోపాటు ఆ యువకులను కూడా పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలిసింది. ఈ విషయంపై సీఐ రామకృష్ణయ్య మాట్లాడుతూ అనుమానం రావడంతో విచారణ చేస్తున్నామని, పూర్తి విషయం విచారణలో తెలియాల్సి ఉందన్నారు.

వినూత్న ఆలోచన...

చీరలతో బొప్పాయి పండ్లకు రక్షణ





రుద్రవరం, మార్చి 17: మండలంలోని తువ్వపల్లె గ్రామానికి చెందిన రైతు ఇమాంఖాసీం రెడ్డిపల్లెమిట్ట సమీపంలో ఐదెకరాల బొప్పాయి తోట సాగు చేశారు. ఎండ వేడిమి నుంచి బొప్పాయిపండ్లను కాపాడుకునేందుకు ప్రతి చెట్టుకు ఒక చీరను ఏర్పాటు చేశాడు. సాయంత్రం పడమటి నుంచి ఎండ తగలకుండా పడమటి దిశన ప్రతి చెట్టుకు ఒక చీర చుట్టాడు. ఇలా ఏర్పాటు చేయడంతో బొప్పాయి పండ్లకు ఎండనుంచి రక్షణ ఉంటుందంటున్నాడు రైతు ఇమాంఖాసీం. సుమారు ఐదువేల చెట్లకు ఇలా చీరలు చుట్టినట్లు తెలిపాడు.

చికిత్స పొందుతూ రైతు ఆత్మహత్య

క్రిష్ణగిరి, మార్చి 17: మండలంలోని లాలుమాన్ పల్లె గ్రామానికి చెందిన రైతు షేక్ అల్లాబకాష్ (42) చికిత్స పొందుతూ ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి వివరాల మేరకు.. షేక్ అల్లాబకాష్ ప్రతి ఏటా పంటల సాగు కోసం అప్పులు చేశాడు. ఈ సంవత్సరం కూడా పంటల సాగు కోసం అప్పులు చేసి వేరుశనగ, కంది, ఆముదం పంటలను సాగు చేశాడు. రుణదాతల నుంచి ఒత్తిళ్ల అధికం కావడంతో మనస్తాపానికి గురై మామిడి తోటలో పురుగుమందు తాగాడు. మెరుగైన వైద్య చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. భార్య షేక్ హలీమ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

● ఫరూక్‌కు ప్రజల వినతి



ఫరూక్‌ను కలిసిన బాపూజీనగర్ గ్రామస్థులు

నంద్యాల (నూనెపల్లె), మార్చి 17: సమస్యలను పరిష్కరించాలని కానాల, బాపూజీనగర్ గ్రామస్థులు టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, నంద్యాల ఇన్‌చార్జి ఎన్‌ఎండీ ఫరూక్‌ను కోరారు. ఆదివారం నంద్యాలలోని ఖలీల్ థియేటర్ ఆవరణలో ఉన్న టీడీపీ కార్యాలయంలో ఫరూక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామంలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రాగానే గ్రామంలోని సమస్యలను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

● నంద్యాలలోని 38వ వార్డు ఇన్‌చార్జి తాటికొండ బుగ్గరాముడు ఆధ్వర్యంలో 100 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. ఆదివారం వైఎస్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌ఎండీ ఫిరోజ్ పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. అంతకు ముందు స్థానిక టీడీపీ కార్యాలయంలో 41వ వార్డు నుంచి మహిళలు టీడీపీలో చేరారు. ఎన్‌ఎండీ ఫిరోజ్ మహిళలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

క్రీడాకారులకు బెల్ట్‌ల ప్రదానం



బెల్ట్‌లతో క్రీడాకారులు

నంద్యాల రూరల్, మార్చి 17: నంద్యాల ఇండోర్ స్టేడియం ఆవరణలో ఆదివారం స్థానిక తైక్వాండో క్రీడాకారులకు పుంసే పోటీలు నిర్వహించారు. జిల్లా కేంద్రానికి చెందిన వహబ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రతిభ చూపిన క్రీడాకారులకు బెల్ట్‌లు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ తైక్వాండో క్రీడ వల్ల శారీక మానసిక ఆరోగ్యంతో పాటు గుర్తింపు పొందిన క్రీడాకారులకు ఉద్యోగాల్లో ప్రభుత్వం రిజర్వేషన్ కల్పించిందని చెప్పారు. ఈ క్రీడల వైపు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో తైక్వాండో సీనియర్ మాస్టర్ గౌస్, కోచ్ రాజ్‌కుమార్ సీనియర్ క్రీడాకారులు జాహీద్, సుబ్బారావు, శృతి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో పోస్టర్ల తొలగింపు



లక్ష్మాపురం సచివాలయాన్ని పరిశీలిస్తున్న ఈవోఆర్డీ

పగిడ్యాల, మార్చి 17: ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు మండలంలోని వివిధ గ్రామాల్లోని సచివాలయాలలో ప్రభుత్వ పథకాలు, నాయకుల ఫొటోలను తొలగించినట్లు ఈవోఆర్డీ నాగేంద్రమయ్య తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం ఆయా గ్రామాల్లోని సచివాలయాలలో పంచాయతీ కార్యదర్శులు పోస్టర్లను తొలగించినట్లు తెలిపారు. అలాగే గ్రామాల్లో రాజకీయ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెకీలను కూడా తీసివేయించారు.

'విద్యార్థుల బస్సును ఎర్రమఠం వరకు నడపాలి'



ఆర్టీసీ అధికారికి వినతి పత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కొత్తపల్లి, మార్చి 17: ఆత్మకూరు నుంచి గుమ్మడాపురం వరకు వస్తున్న విద్యార్థి బస్సును ఎర్రమఠం వరకు నడపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు దినేష్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విద్యార్థి నాయకులతో కలిసి ఆత్మకూరు ఆర్టీసీ అధికారులకు వినతి పత్రం అందజేశారు. దినేష్ మాట్లాడుతూ మండలంలోని ఎర్రమఠం గ్రామం నుంచి కొత్తపల్లి హై స్కూల్‌కు విద్యార్థులు ప్రతిరోజు వస్తున్నారని, అయితే మధ్యాహ్న సమయంలో ఎర్రమఠం వేళ్లేందుకు బస్సులు లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఆత్మకూరు నుంచి మధ్యాహ్న సమయంలో గుమ్మడాపురం వెళ్లే విద్యార్థి బస్సును ఎర్రమఠం వరకు పొడిగిస్తే ఎర్రమఠం విద్యార్థులకు ఇబ్బంది ఉండదని తెలిపారు.

గ్రామాల్లో కవాతు



బుక్కాపురంలో..



బానకచెర్లలో కవాతు నిర్వహిస్తున్న దృశ్యం

పాములపాడు, మార్చి 17: మండలంలోని ఎర్రగూడూరు, బానుముక్కల, బానకచెర్ల, గుండాలనట్లు తదితర గ్రామాలలో పాములపాడు పోలీస్ స్టేషన్ ఎస్ఐ అశోక్ ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాల కవాతు నిర్వహించారు. ఆయా గ్రామాలలోని కూడలిలో గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ప్రజలు తమ ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరు ఓటును వినియోగించుకోవాలని సూచించారు. గ్రామాలలో ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘించి అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కేంద్ర పోలీస్ బలగాలు, స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పగిడ్యాల: ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని నెహ్రూనగర్, ముచ్చుమర్రి, ప్రాతకోట గ్రామాలో నందికొట్కూరు రూరల్ సీఐ విజయ భాస్కర్, ఎస్ఐ జయశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం కేంద్ర బలగాలు, పోలీస్ సిబ్బందితో కవాతు నిర్వహించారు. సాధారణ ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సమస్యాత్మక గ్రామాల్లో కవాతు నిర్వహించినట్లు తెలిపారు. ఆయా గ్రామాలోని పుర వీధులగుండా కవాతు నిర్వహిస్తూ ప్రశాంతగా ఎన్నికలు జరిగేలా సహకరించాలని కోరారు.

మహానంది: ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్ సూచించారు. తిమ్మాపురం, బుక్కాపురం గ్రామాల్లో బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్ బలగాలతో ఆదివారం కవాతు నిర్వహించారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని, అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి అందరూ సహకరించాలని కోరారు. గ్రామాల్లో సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకొని వచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'సనాతన ధర్మాన్ని కాపాడుకుందాం'



ఏకశిల ఆంజనేయస్వామిని దర్శించుకున్న అర్చకులు

బండిఆత్మకూరు, మార్చి 17: ప్రతి ఒక్క హిందువు సనాతన ధర్మాన్ని పాటిస్తూ కాపాడుకోవాలని సమరసత సేవాసమితి విష్ణువు, ఏకశిల నిర్వాహకులు శివరాజునాయక్ సూచించారు. మండలంలోని ఏకశిల అభయాంజనేయ స్వామి ఆలయాన్ని వారు ఎస్సీ, ఎస్టీ, మత్స్యకార అర్చకులతో కలసి దర్శించి పూజలు చేశారు. టీటీడీ ఆధ్వర్యంలో స్వేతసౌద్‌లో శిక్షణ ఇచ్చారని ఆయన తెలిపారు. వీరందరికీ టీటీడీ నిర్మించిన 804 దేవాలయాల్లో అవకాశం కల్పిస్తుందన్నారు. అపర్ణదీపిక, ప్రభాకర్‌రెడ్డి, నాగేశ్వరరావు నాయక్, తేజనాయక్ పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం



భక్తుడికి స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేస్తున్న పర్యవేక్షకురాలు

శ్రీశైలం, మార్చి 17: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహి స్తున్న నిత్యాన్నదాన పథకానికి ఆదివారం ప్రకాశం జిల్లాకు చెందిన ఎన్. మురళీకృష్ణ అనే భక్తుడు రూ.లక్ష విరాళాన్ని పర్యవేక్షకులు హిమబిందుకు అందజేశారు. భక్తుడికి దేవస్థానం అధికారులు స్వామివారి శేష వస్త్రం, ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

పది పరీక్ష కేంద్రాల పరిశీలన



పగిడ్యాల జడ్పీ హైస్కూల్‌లో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో

పగిడ్యాల, మార్చి 17: పది పరీక్షల ఏర్పాట్లను ఎంఈవో సుభాన్ ఆదివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది తొలిసారిగా మూడు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రంలో గురుకుల పాఠశాల, ఆదర్శపాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయానికి చెందిన 221 మంది విద్యార్థులు, ముచ్చుమర్రి జడ్పీ హైస్కూల్‌లోని పరీక్ష కేంద్రంలో ముచ్చుమర్రి, నెహ్రూనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన 171 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. లక్ష్మాపురం అంచె సమీపంలోని బాలికల గురుకుల పాఠశాలలో ఏర్పాటు పరీక్ష కేంద్రంలో పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాతకోట జడ్పీ పాఠశాల, ఆదర్శ పాఠశాలకు చెందిన 233 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఆయన చెప్పారు.

మహానంది: మహానంది మండలంలో పది పరీక్ష కేంద్రాల కోసం నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈవో రామసుబ్బయ్య ఆదివారం తెలిపారు. మండలంలోని గాజులపల్లిలో జడ్‌పి పాఠశాల, క్రీస్తు జ్యోతి పాఠశాల, ఎం.తిమ్మాపురంలో ప్రభుత్వ జడ్పీ హైస్కూల్‌తో పాటు మోడల్ పాఠశాలలో పది పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 785 మంది విద్యార్థులు పది పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్నట్లు ఎంఈవో తెలిపారు.

వైభవంగా పల్లకీ ఉత్సవం



పల్లకిలో పూజలందుకున్న స్వామి, అమ్మవార్లు

శ్రీశైలం, మార్చి 17: శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థం ఆదివారాన్ని పురస్కరించుకొని స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో నిర్వహించిన ఉత్సవ కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతికి ప్రత్యేక పూజలు చేశారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు నిర్వహించి పల్లకీలో ఆశీనులనుజేసి ఆలమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఘనంగా ఉత్సవాన్ని నిర్వహించారు.

నవగ్రహ హోమం



హోమంలో పాల్గొన్న దంపతులు

ఆత్మకూరు రూరల్, మార్చి 17: మండలంలోని కురుకుంద గ్రామంలో వెలసిన కురుకులాంబదేవీ ఆలయంలో వార్షిక జయంతి ఉత్సవాలలో భాగంగా నాలుగో రోజు ఆదివారం ఆదిత్యాది నవగ్రహ హోమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం వేద పండితులు వెంకటా చలపతి శర్మ ఆధ్వర్యంలో కురుకులాంబ అమ్మవారికి అభిషేక క్రతువులు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. వేద పండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ఆదిత్యాది నవగ్రహ హోమం నిర్వహించారు. ఈ హోమ పూజల్లో దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ పురోహితులు కృష్ణమోహనశర్మ ఆధ్వర్యంలో మహిళలు కుంకుమార్చనలు, అష్టోత్తర పూజలు, సామూహిక సహస్ర పారాయణ హోమాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో చివరిరోజైన సోమవారం కురుకులాంబ అమ్మవారికి పంచామృత అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే ఆలయ ఆవరణలో చండీహోమం, కుంబాభిషేకం నిర్వహించి, పూర్ణాహుతితో ఈ వేడుకలను ముగించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే భక్తులు అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు.

బాధిత కుటుంబానికి చేయూత



బాధిత కుటుంబానికి నిత్యావసరాలు అందిస్తున్న నాయకులు

బండిఆత్మకూరు, మార్చి 17: మండలంలోని పార్నపల్లె గ్రామంలో దళితవాడకు చెందిన మార్తమ్మ అనే మహిళ గుడిసె ఇటీవల ప్రమాదవశాత్తు కాలిపోయింది. దీంతో పొదుపు కార్యాలయ కమ్యూనిటీ కో ఆర్డినేటర్ సుబ్బయ్య మార్తమ్మకు 50 కేజీల బియ్యం, కందిపప్పు, నూనె, ఇతర నిత్యావసర సరుకులు, రూ.2వేల నగదు అందజేశారు. దీంతో సుబ్బయ్యను సీపీఎం నాయకులు రత్నమయ్య, డేవిడ్, రాజు అభినందించారు. కష్ట సమయంలో ఉన్న వారిని ఆదుకోవాలని దాతలను వారు కోరారు.

'మామిడి రైతులకు పరిహారం చెల్లించాలి'



తెగుళ్లు సోకిన మామిడి చెట్టును చూపుతున్న నాయకులు

ఆత్మకూరు రూరల్, మార్చి 17: జిల్లాలో వేలాది ఎకరాల్లో సాగు చేసిన మామిడి తోటలకు నల్లతామర తెగుళ్లు సోకి 90 శాతం మామిడి పంట దెబ్బతిందని, తెగుళ్ల వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, పండ్ల తోటల రైతు సంఘం నాయకులు బైరాపురం మహబూబ్‌బాషా, సీఐటీయూ నాయకులు రణధీర్, వీరన్న, సురేంద్ర డిమాండ్ చేశారు. ఆదివారం వారు మండలంలోని పలువురు రైతుల మామిడి తోటలను పరిశీలించారు. నాయకులు మాట్లాడుతూ జిల్లాలో ఆత్మకూరు, వెలుగోడు, కొత్తపల్లి, గడివేముల, బేతంచెర్ల, బనగానపల్లె, మహానంది తదితర ప్రాంతాలలో వేలాది ఎకరాల్లో సాగు చేసిన మామిడి పంటలకు వర్షాలు తక్కువగా ఉండటం వల్ల తెగుళ్లు సోకాయన్నారు. పూత నిలబడక, కాయ పిందలతో సహా రాలిపోతోందని చెప్పారు. పెట్టుబడి కూడా రావడం లేదని, పంట నష్టపోయిన ప్రతి మామిడి రైతులకు పంటల భీమా పథకం ద్వారా ఎకరాకు రూ50 వేల నష్టపరిహారం చెల్లించి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

'టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి'

పాణ్యం, మార్చి 17: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పాణ్యం మాజీ జడ్పీటీసీ సభ్యురాలు నారాయణమ్మ అన్నారు. టీడీపీ శంఖారావంలో భాగంగా ఆదివారం స్థానిక ఇంరానగర్‌లోని చెంచులకు సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంపై మహిళల్లో మంచి స్పందన వచ్చిందన్నారు. తల్లికి వందనంలో భాగంగా ఇంట్లో చదివే పిల్లందరికీ ప్రతి ఏటా రూ.15 వేలు, ఆడబిడ్డ నిధి నుంచి 18ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.15 వందలు అందిస్తారన్నారు. దీపం పథకం ద్వారా ప్రతి ఏటా ప్రతి కుటుంబానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం కల్పిస్తుందన్నారు. ఐదేళ్లలో 20 లక్షల మంది యువతకు ఉపాధి. నిరుద్యోగ యువకులకు ప్రతి నెలా యువగళం నుంచి రూ.3 వేలు జీవన భృతి కింద అందించనున్నట్లు తెలిపారు. రైతులకు ప్రతి ఏటా రూ.20 వేలు ఆర్థిక సాయం, ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగం కల్పించిన రక్షణ చట్టానికి దీటుగా వైసీపీ అరాచకాలను ఎదుర్కొనేందుకు బీసీలకు రక్షణ చట్టాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటికి రక్షిత తాగునీటి కొళాయి కనెక్షన్ కల్పిస్తారని చెప్పారు. కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముస్లిం, మైనార్టీ నాయకులు ఖాదర్‌బాషా, చెంచులు పాల్గొన్నారు.

మహానంది: వచ్చే ఎన్నికల్లో ప్రజలు టీడీపీని ఆదరించాలని మహానంది టీడీపీ ఇన్‌చార్జి గని చిన్న రంగస్వామి, నూరే శ్రీనివాసులు కోరారు. ఆదివారం సాయంత్రం మహానంది గ్రామంలో టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి మినీ మేనిఫెస్టో గురించి వివరించారు. చంద్రబాబుతోనే రాష్ట్రాభి వృద్ధి సాధ్యమన్నారు. లక్ష్మీనారాయణగౌడ్, సుబ్బరాయిడు, ఎల్లయ్య, పటాల శ్రీను, ఐటీడీపీ సభ్యులు పెద్ది శేఖర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కోలాటంలో ఉత్తమ ప్రదర్శన



టీం లీడర్‌ను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

నందికొట్కూరు, మార్చి 17: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తిరుపతిలో కోలాటంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళలను నందికొట్కూరు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కోలాటంలో 30 మంది మహిళలు ప్రతిభ కనబరిచినందుకు టీం లీడర్ దిండుకుర్తి మంజులా రాణిని సన్మానించారు.

పోలీసులకు కిట్ల పంపిణీ



పోలీసులకు కిట్లను అందజేస్తున్న మారుతీకుమార్

నంద్యాల (నూనెపల్లె), మార్చి 17: నంద్యాలలోని సెవెన్‌హిల్స్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి, కాత్యాయిని మెడికల్స్ అండ్ సర్జికల్ ఎండీ మారుతీకుమార్ పోలీసులకు టోపీలు, చలువ కళ్లజోడు కిట్లను ఆదివారం పంపిణీ చేశారు. ఎండల తీవ్రతకు పోలీసులు ఇబ్బందులు పడకుండా వేడిమి తాపానికి అవసరమయ్యే టోపీలను, చలువ కళ్ళ జోడులను ఎస్పీ సమక్షంలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి ఇదివరకే అందజేశారు. వన్‌టౌన్ పోలీసుల అభ్యర్థన మేరకు రూ.15 వేల విలువ చేసే టోపీలు, చలువ కళ్లజోడు కిట్లను 13 మంది కానిస్టేబుళ్లకు పంపిణీ చేశారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా బాలకృష్ణ

నంద్యాల (నూనెపల్లె), మార్చి 17: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ విభాగం రాష్ట్ర వైస్ చైర్మన్‌గా నంద్యాలకు చెందిన బాలకృష్ణను నియమించారు. ఈనెల 14వ తేదీ విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం రాజ్ భవన్‌లో ఆ పార్టీ ఎస్సీ విభాగం చైర్మన్ సాకె శంకర్ నియామక పత్రాన్ని అందజేశారు. ఆదివారం నంద్యాలలోని రాజీవ్‌గాంధీ భవన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ చింతల మోహన్‌రావు, తదితర కాంగ్రెస్ నాయకులు బాలకృష్ణను అభినందించారు.

రాజకీయ నాయకుల ఫ్లెక్సీల తొలగింపు



ఆత్మకూరులో ఫ్లెక్సీని తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది



విగ్రహానికి ముసుగు వేస్తున్న దృశ్యం

ఆత్మకూరు, మార్చి 17: ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించడంతో రాష్ట్రవ్యాప్తంగా ఎలక్షన్ కోడ్ అమలులోకి వచ్చింది. ఈనెల 16వ తేదీ మధ్యాహ్నం 3 గంటల నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చింది. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో పట్టణం, గ్రామాల్లో అధికారులు, రెవెన్యూ సిబ్బంది సహకారంతో ఆదివారం రాజకీయ నాయకుల పోస్టర్లను తొలగించారు. అలాగే ప్రభుత్వ ఆస్తులపై ఉన్న రాజకీయ నాయకుల పోస్టర్లపై పేపర్‌లను అతికించారు. అలాగే కటౌట్లు, హోర్డింగ్‌లు,రాజకీయ పార్టీల జెండాలు, గోడ రాతలను తొలగించారు. అలాగే పలు రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు. అలాగే రేషన్ వాహనాలకు ఉన్న ప్రజాప్రతినిధుల చిత్రపటాలకు పేపర్లను అతికించారు.ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

నేడు రెజ్లింగ్ ఎంపిక పోటీలు

నంద్యాల (నూనెపల్లె), మార్చి 17: జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సీనియర్స్ అండర్ -20 బాల, బాలికల రెజ్లింగ్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా సెక్రటరీ రాబర్ట్ ఆదివారం తెలిపారు. నంద్యాలలోని పద్మావతినగర్‌లో ఉన్న జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఇండోర్ స్టేడియంలో సోమవారం ఉదయం 10 గంటలకు ఎంపిక పోటీలు జరుగుతాయని చెప్పారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తమ ఆధార్ కార్డుతో రావాలని సూచించారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారు లను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని, ఈనెల 20, 21వ తేదీల్లో చిత్తూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని ఆయన తెలిపారు. మరింత సమాచారానికి 9676095979 నంబరులో సంప్రదించాలని సూచించారు.

నల్లమల కళావిహీనం

● ఎండల ధాటికి ఎండుతున్న చెట్లు



దారి పొడవునా ఎండిపోయిన చెట్లు

బండిఆత్మకూరు, మార్చి 17: ఎండల తీవ్రతకు నల్లమల పచ్చదనం అప్పుడే మలమల మాడిపోయింది. వేసవి అసలు సిసలైన ఏప్రిల్, మే నెలలు ఆరంభానికి ముందే మార్చి నెల ప్రారంభంలోనే ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు తాకుతుండటంతో పచ్చదనం అంతా మాడిపోయింది. చెట్లంతా ఎండిపోయినట్లు కావటంతో నల్లమల అటవీ కళాహీనంగా మారింది.

విజిలెన్స్ కమిటీ మెంబర్‌కు సన్మానం



డోన్‌లో ఏఈ నాగరాజును సన్మానిస్తున్న సంఘం నాయకులు

డోన్(రూరల్), మార్చి 17: జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ ఏఈ నాగరాజుకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం పట్టణంలోని ముక్తేశ్వర స్వామి ఆలయ పరిసర ప్రాంతంలో వినియోగదారుల రక్షణ సంఘం, బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఏఈ నాగరాజును శాలువాతో సన్మానించారు. వినియోగదారులకు ఆయన అందిస్తున్న సేవలను గుర్తించి ప్రభుత్వం విజిలెన్స్ జిల్లా కమిటీ మెంబరుగా ఏఈ నాగరాజును నియమించడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వినియోగదారుల రక్షణ సంఘం నాయకులు మల్లికార్జున స్వామి, బీసీ సంక్షేమ సంఘం నాయకులు విజయనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలపై పోరాటం



డోన్‌లో పెన్షనర్ చంద్రశేఖర్ రెడ్డికి సన్మానిస్తున్న ఆ సంఘం నాయకులు

డోన్(రూరల్), మార్చి 17: పెన్షనర్ల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని ఆ సంఘం అధ్యక్షులు కేఎన్ భానుసింగ్ అన్నారు. ఆదివారం పెన్షనర్ల సంఘం కార్యాలయంలో 80 సంవత్సరాలు దాటిన పెన్షనర్ చంద్రశేఖర్ రెడ్డికి సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కేఎన్ భానుసింగ్ మాట్లాడుతూ ప్రభుత్వం 12వ పీఆర్సీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నాయకులు గోపాల్, గాలయ్య, మౌలాలి, రాయుడు, ఆంజనేయులు, దాసప్ప, సంగీతరావు పాల్గొన్నారు.

వాసవీమాత వ్రత మహోత్సవం



కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

చాగలమర్రి, మార్చి 17: చాగలమర్రిలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం ముగింపు సందర్భంగా మహిళలు వాసవీమాత సామూహిక వ్రత మహోత్సవం నిర్వహించారు. వేదపండితుడు పెద్దశాస్త్రీ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మహిళలు అమ్మవారికి వడిబియ్యం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు లక్ష్మణబాబు, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

● వీరాంజనేయ స్వామి ప్రతిష్ఠ మహోత్సవం

చాగలమర్రిలోని గాంధీ బజార్‌లో వెలసిన వీరాంజనేయస్వామి ఆలయ ప్రతిష్ఠ దిన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆదివారం వేద పండితుడు ప్రతాప్‌శర్మ ఆధ్వర్యంలో ఆంజనేయస్వామికి తమలపాకులతో అభిషేకాలు చేశారు. మహిళలు సామూహికంగా భజన కార్యక్రమాలు, ఆంజనేయస్వామి వ్రతం చేశారు.

ఆలయాభివృద్ధికి 1.50 లక్షల విరాళం



టంగుటూరు పెద్దమ్మ తల్లికి విరాళం అందిస్తున్న దాతలు

బనగానపల్లె, మార్చి 17: నంద్యాల మండలం హైస్కూల్ కొట్టాల గ్రామానికి చెందిన ముక్కుతిరుపతిరెడ్డి, తిరుపతమ్మ దంపతులు వీరి కుమారులు శేషిరెడ్డి, శేఖర్‌రెడ్డి, శివారెడ్డి వారి కుటుంబ సభ్యులు టంగుటూరు పెద్దమ్మతల్లిపై భక్తితో ఆదివారం రూ.1లక్ష విరాళం ఆలయ కమిటీ ఛైర్మన్ రామగంగిరెడ్డికి అందించారు. అలాగే టంగుటూరు గ్రామానికి చెందిన వెంకటసుబ్బారెడ్డి, వెంకటసుబ్బమ్మలు వారి కుమారులు గంగాధర్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి నిత్యాన్నభవ నిర్మాణానికి రూ. 50వేలు విరాళం ఆలయ కమిటీ ఛైర్మన్ రామగంగిరెడ్డికి అందించారు.

వ్యక్తి అరెస్టు

కోవెలకుంట్ల, మార్చి 17 : మండలంలోని భీమునిపాడు గ్రామానికి చెందిన బాబు అనే వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా అరెస్టు చేసినట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు. 20 బాటిల్‌లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పకడ్బందీగా పది పరీక్షలు

చాగలమర్రి, మార్చి 17: చాగలమర్రిలో సోమవారం నుంచి జరిగే పది పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల అన్నారు. ఆదివారం బాలికల పరీక్షా కేంద్రంలో వారు మాట్లాడుతూ మూడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని అన్నారు. పోలీసు స్టేషన్‌లో పది ప్రశ్నపత్రాలను భద్రపరిచామని అన్నారు. పరీక్షా కేంద్రాల సీఎస్, డీవోలు ప్రతి రోజూ పోలీసు స్టేషన్ వెళ్లి ప్రశ్న పత్రాలను తెచ్చుకోవాల్సి ఉంటుందని అన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని అన్నారు.

రుద్రవరం: రుద్రవరం మండలంలో నరసాపురం, రుద్రవరం గ్రామాల్లో పది పరీక్ష కేంద్రాలను ఏర్పాట్లు చేసినట్లు చీఫ్ సుబ్బరాయుడు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసరు బాలగురప్ప ఆదివారం తెలిపారు. విద్యార్థులు పరీక్ష రాసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు.

విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం

బనగానపల్లె, మార్చి 17: పదో తరగతి విద్యార్థులకు సోమవారం నుంచి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించినట్లు బనగానపల్లె డిపో మేనేజరు కిశోర్‌కుమార్ ఆదివారం తెలిపారు. పదో తరగతి విద్యార్థులు హాల్ టికెట్ చూపిస్తే వారి గ్రామాల నుంచి పరీక్ష కేంద్రాలకు ఉచితంగా ప్రయాణించవచ్చని ఆయన తెలిపారు. పదో తరగతి విద్యార్థులు పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్ చూపించి ఆర్టీసీ బస్సుల్లో పదో తరగతిపరీక్షా కేంద్రాల వరకు ప్రయాణించి తిరిగి వారి గ్రామాలకు ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు.

దొర్నిపాడు: మండలంలోని దొర్నిపాడు గ్రామంలో 18 నుంచి 27వ తేదీ వరకు పది పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల చీఫ్ వై.రాజు తెలిపారు. దొర్నిపాడు జడ్పీహెచ్ పాఠశాలలో 255 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాల వద్దకు కేటాయించిన సమయం లోపు హాల్ టికెట్లతో హాజరు కావాలని సూచించారు.

కోవెలకుంట్ల: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు కోవెలకుంట్ల మండలంలో సోమవారం నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవోలు వెంకటరామిరెడ్డి, వెంకటసుబ్బయ్యలు ఆదివారం తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో 254 మంది విద్యార్థులు బాలికల ఉన్నత పాఠశాలలో 190 మంది, సెంట్ జోసెఫ్ ఉన్నత పాఠశాలలో 210 మంది, పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చీఫ్‌గా నాగేషుడు, డిపార్టుమెంటల్ అధికారిగా జానకిరెడ్డి, బాలికల ఉన్నతపాఠశాలలో చీఫ్‌గా అరుణకుమారి, డిపార్టుమెంటల్ అధికారిగా పాండురంగారెడ్డి, సెయింట్‌జోసెఫ్ ఉన్నత పాఠశాలలో చీఫ్‌గా శివలక్ష్మి, యాగంటప్పలు వ్యవహరించనున్నట్లు వారు తెలిపారు.

చంద్రబాబును సీఎం చేద్దాం

మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి పిలుపు



టీడీపీలో చేరుతున్న కోవెలకుంట్ల వైసీపీ నాయకులు



టీడీపీలో చేరిన వంగల పరమేశ్వరరెడ్డిని అభినందిస్తున్న కోనాపురం ఎస్సీ కాలనీవాసులు

బనగానపల్లె, మార్చి 17: బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో ఆదివారం టీడీపీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో పట్టణంలోని సంతపేట, కర్ణమయ్య వీధికి చెందిన సుమారు 30 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరికి బీసీ టీడీపీ కండువాలు కప్పి పార్టీలోని ఆహ్వానించారు. రబ్బానీ, సలాం, గౌస్‌పీరా, వలి, నూర్‌మహమ్మద్, జిన్నా, చిన్న రబ్బానీ, నూర్, , షాకీర్, అనిఫ్, మెకానిక్ వలి, షేక్ అబ్దుల్, జిలాన్, షేక్ సలాం, అక్బర్, ఇలియాజ్, ఆఫ్రిద్‌తో పాటు 30 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. బీసీ మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ ప్రభుత్వాలు ఏర్పడతాయని అందరం కలసి చంద్రబాబును సీఎం చేసుకుందామని పిలుపునిచ్చారు. టీడీపీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు.

టీడీపీలోకి కొలిమిగుండ్ల మైనార్టీ నాయకులు

బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో చేరికలో భాగంగా కొలిమిగుండ్ల మండలం టీడీపీ నాయకుడు అంబటి జయలక్ష్మిరెడ్డి, ఆస్మిత్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, భూపాల్ ఆధ్వర్యంలో కొలిమిగుండ్ల మండలం అబ్దుల్లాపురంకు చెందిన మైనార్టీకి చెందిన 12 కుటుంబాలు బనగానపల్లె టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో ఆదివారం చేరారు. వీరికి బీసీ జనార్దనరెడ్డి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. హసన్‌వలి, హజీసా, బావాజీ, సురేశ్‌గౌడ్, హుసేన్‌సా, హజాసా, బాబావలి, పెద్దహజా, లక్ష్మన్న, బోయసుదర్శన్, మదార్‌వలి తదితరులు టీడీపీలో చేరారు వారు మాట్లాడుతూ జగన్‌పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో వెనుకబడి పోయిందన్నారు. రాష్ట్ర భవిష్యత్ చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని బనగానపల్లెలో అభివృద్ధి బీసీ జనార్దన్‌రెడ్డితో సాధ్యమని నమ్మి టీడీపీలో చేరామన్నారు. బీసీ మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి సముచిత ప్రాధాన్యత ఇస్తామన్నారు.

టీడీపీలో చేరిన వంగల పరమేశ్వరరెడ్డి

అవుకు మండలం కోనాపురం గ్రామానికి చెందిన వంగల పరమేశ్వర్‌రెడ్డి వైసీపీని వీడి టీడీపీలో చేరడంతో ఆయనను కోనాపురం గ్రామానికి చెందిన 50 ఎస్సీ కుటుంబాలు బనగానపల్లెలోని ఆయన స్వగృహంలో వంగల పరమేశ్వర్‌రెడ్డిని కలుసుకొని ఆదివారం అభినందించారు. వంగాల పరమేశ్వర్‌రెడ్డికి పూలమాలలు వేసి ఆయనకు మద్దతు పలికారు. కోనాపురం ఎస్సీ కాలనీ వాసులు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి గెలుపుకోసం తమ వంతు కృషి చేస్తామని వారు తెలిపారు.

ఎన్నికల సంగ్రామంలో టీడీపీదే విజయం

చాగలమర్రి, మార్చి 17: ఎన్నికల సంగ్రామంలో టీడీపీ విజయం తథ్యమని మైనార్టీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా అన్నారు. ఆదివారం చాగలమర్రిలో టీడీపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియ విజయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీసెల్ నంద్యాల స్పోక్‌పర్సన్ సల్లానాగరాజు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, టీడీపీ నాయకులు కొలిమి ఉసేన్‌వలి, కొలిమి షరిఫ్, మౌళాలి, అనిఫ్, మాబులాల్, ఖలీల్, గఫార్, అజీమ్, కరిముల్లా, జెట్టి నాగరాజు, భాస్కర్‌రెడ్డి, సుబ్బారావు, రమేష్, రవి, అబ్దుల్ ఖాదర్, రాజేష్, ఓబులేసు, షరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

● టీడీపీతోనే బీసీల సంక్షేమం సాధ్యమని మండల బీసీ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్ అన్నారు. ఆదివారం బీసీ సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలకు రాజ్యాధికారం కల్పించిన ఏకైక పార్టీ టీడీపీ అన్నారు. టీడీపీ ప్రభుత్వంలో బీసీలకు కార్పొరేషన్‌ల ద్వారా సబ్సిడీ రుణాలు ఇచ్చిందని అన్నారు. వైసీపీ పాలనలో బీసీ కార్పొరేషన్‌లను నిర్వీర్యం చేసిందని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు రామతీర్థం, సుబ్బరాయుడు, లాలయ్య, సిద్ధప్ప, చిన్నికృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీలంతా ఏకమై వైసీపీని తరిమేయాలి

శిరివెళ్ల, మార్చి 17 : రాష్ట్రంలోని బీసీలు అందరూ ఏకమై వైసీపీని తరిమేయాలని టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. జయహో బీసీ డిక్లరేషన్ సమావేశాన్ని శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షతన శిరివెళ్లలో ఆదివారం నిర్వహించారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్‌ను వైసీపీ ప్రభుత్వం 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించిందన్నారు. బీసీలకు అడుగడుగునా అన్యాయం చేసిన వైసీపీకి రానున్న ఎన్నికల్లో బీసీల తీర్పు చెంపపెట్టు కావాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మురళి, పీపీ లింగమయ్య, కొండబోయిన బాలచంద్రుడు, తిరుమల రవి, శీలం లక్ష్మీప్రసాద్, బండారు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: రాష్ట్రంలో బీసీలకు రాజ్యాధికారం కలించిన ఏకైక పార్టీ టీడీపీ పార్టీనే అని మండల టీడీపీ అధ్యక్షులు అమడాల మద్దిలేటి, బిజినవేముల హుస్సేనయ్య, వెలగటూరు ధనుంచయుడు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన బీసీ డిక్లరేషన్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాహెబ్‌బాషా, మూర్తి, వేణు, వాల్మీకి రంగడు, వడ్డెశీను, బాలచెన్నయ్య, దస్తగిరి, శివకుమార్, మల్లేష్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

● సీఎం జగన్‌ను ఇంటికి పంపేందుకు ఏపీ ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఒక్క చాన్సు పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్ సమర్థవంతమైన పాలన అందించడంతో విఫలమయ్యారన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన



రుద్రవరం పాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జగన్ పోస్టరు



కోవెలకుంట్లలో..



యర్రగుంట్లలో శిలాఫలకాలను మూసివేస్తున్న అధికారులు

రుద్రవరం, మార్చి 17: కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల కోడ్‌ను శనివారం సాయంత్రం నుంచి అమలు చేసింది. అధికారులు మాత్రం ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారు. ఆదివారం రుద్రవరంలోని పాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీఎం జగన్ పోస్టరు అలాగే వదిలేశారు. విద్యాశాఖ కార్యాయలం వద్ద గదికి అటు వైపు ఇటు వైపు విద్యాశాఖ మంత్ర సీఎం జగన్ ఫొటోలో ఉన్న గోడ పత్రిను అలాగే వదిలేశారు. ఎన్నికల సంఘం నియమాలను అధికారులు పాటించలేదనడానికి నిదర్శనం ఈ ఫ్లెక్సీలే అని విమర్శలున్నాయి.

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల పట్టణంలో సీఎం జగన్ ఫొటో ఆదివారం తొలగించలేదు. కోవెలకుంట్లలోని పాండురంగస్వామి ఆలయం సమీపంలోని బనగానపల్లె సర్కిల్‌లో అక్కాచెల్లెమ్మల కల నాకల అన్న ఫ్లెక్సీ బహిరంగంగా కనిపిస్తున్నా ఎన్నికల అధికారులకు ఈఫ్లెక్సీ తొలగించలేదు. అలాగే ఫ్లెక్సీ పక్కనే మరో ఫ్లెక్సీలో సీఎం జగన్, ఇరిగేషన్ శాఖ ఛైర్మన్ కర్రాగిరిజమ్మ, కర్రాహర్షవర్దన్‌రెడ్డితో కూడిన ఫ్లెక్సీ దర్శనమిస్తోంది. కోడ్ అమల్లోకి వచ్చినా సంబంధిత ఎన్నికల అధికారులకు ఈ ఫ్లెక్సీలు కనిపించకపోవడం విచారకరం.

పోలీసుల అనుమతులు తప్పనిసరి

బేతంచెర్ల, మార్చి 17: జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందని ఎటువంటి సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించాలన్నా పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సీఐ ప్రియతమ్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆయా రాజకీయ పార్టీలు ఏవైనా సమావేశాలు, ఊరేగింపులు, డీజేలు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకుని నిర్వహించుకోవాలని, లేకపోతే సంబంధిత వాహనాల యజమానులపై డీజే నిర్వహణ సభ్యులపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రజలు పోలీసుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు.

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

చాగలమర్రి, మార్చి 17: ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ రమణమ్మ అన్నారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలన్నారు. గ్రామాల్లో రాజకీయ పార్టీల వాల్ పోస్టర్లు, జెండాలు, విగ్రహాలకు ముసుగులు వేయించామని అన్నారు. సభలు నిర్వహించే ముందు అనుమతి తప్పనిసరి అన్నారు. గ్రామాల్లో ఎలాంటి రాజకీయ నాయకుల పోస్టర్లు, పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేయరాదని అన్నారు. ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోవడం కోసం ఎన్నికల కమీషన్ ఉత్తర్వులు జారీ చేసిందని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలు సహకరించాలని అన్నారు.

పకడ్బందీగా ఎన్నికల నియమావళి

శిరివెళ్ల, మార్చి 17 : ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని తహసీల్దార్ కుల శేఖర్ ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో మండలంలోని యర్రగుంట్ల, శిరివెళ్ల తదితర అన్ని గ్రామాల్లో రాజకీయ పార్టీల జెండాలు, బ్యానర్లను వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌వోల బృందాలు ఆదివారం తొలగించారు. ప్రభుత్వ కార్యాలయాలు, శిలాఫలకాలపై ఉన్న అధికార పార్టీ ప్రజాప్రతినిధుల చిత్రపటాలను మూసివేశారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని తహసీల్దార్ హెచ్చరించారు.

దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ



దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, మార్చి 17: దివ్యాంగులకు 10 ట్రైసైకిళ్లను బనగానపల్లె నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదివారం పంపిణీ చేశారు. నియోజకవర్గంలో బాబుష్యూరిటీ, భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో తిరుగుతుండగా దివ్యాంగుల కష్టనష్టాలను తెలుసుకొని సొంత నిధులతో ట్రైసైకిళ్ల పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. గతంలో మొదటి విడతగా 12 ట్రైసైకిళ్ల దివ్యాంగులకు పంపిణీ చేయగా, ఆదివారం మరో 10 మందికి 10 ట్రైసైకిళ్ల నియోజకవర్గంలోని దివ్యాంగులకు బీసీ పంపిణీ చేశారు. బీసీ మాట్లాడుతూ మొత్తం 22 మంది దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ చేసినట్లు తెలిపారు. దివ్యాంగులకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని బీసీ భరోసా ఇచ్చారు. బీసీ జనార్దన్‌రెడ్డికి దివ్యాంగులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు టీడీపీ నాయకులు దొనపాటిభాస్కర్‌రెడ్డి, మీరాపురం బాస్కర్‌రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, అహమ్మద్‌హుసేని, జోలాపురంహుసేని, తదితరులు పాల్గొన్నారు.

పుట్టాలమ్మకు పూజలు

నంద్యాల,మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఆళ్లగడ్డ మండలంలో వెలసిన రామతీర్థం పుట్టాలమ్మ అమ్మవారికి ఆదివారం భక్తులు పూజలు చేసేందుకు బారులు తీరారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు అమ్మవారికి కానుకలు సమర్పించుకొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. భక్తులకు వేదపండితులు అన్నదానం చేశారు.

లింగమయ్యకు ప్రత్యేక పూజలు

రుద్రవరం, మార్చి 17 : మండలంలోని ముత్తలూరు గ్రామ సమీపంలో కొలువుదీరిన లింగమయ్యస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

● మండలంలోని కొండమాయపల్లె, రుద్రవరం, చిన్నకంబలూరు, యల్లావత్తుల గ్రామాల్లో గ్రామ దేవతలకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు మారెమ్మ, సుంకులమ్మ, పోలేరమ్మ పెద్దమ్మ అమ్మవార్లకు చీరలు, బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా పల్లకీ ఉత్సవం

శ్రీశైలం, మార్చి 17: శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థం ఆదివారాన్ని పురస్కరించుకొని స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపములో నిర్వహించిన ఉత్సవ కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతికి ప్రత్యేక పూజలు చేశారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు నిర్వహించారు.

● శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఆదివారం ప్రకాశం జిల్లాకు చెందిన ఎస్. మురళీకృష్ణ అనే భక్తుడు రూ.లక్ష విరాళాన్ని పర్యవేక్షకులు హిమబిందుకు అందజేశారు.

మంత్రి బుగ్గనది గ్లోబల్ ప్రచారం

- మెయిన్ రోడ్లకు రంగులు వేస్తే అభివృద్ధా..?
- డోన్ ప్రజలకు నీళ్లిచ్చింది మేమే..
- ప్రజలు టీడీపీ కూటమిని గెలిపించడం ఖాయం
- డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి



డోన్‌లో కూతురితో కలిసి ప్రచారం నిర్వహిస్తున్న కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్, మార్చి 17: మంత్రి బుగ్గన గ్లోబల్ ప్రచారం చేసుకుంటూ డోన్ నియోజకవర్గ ప్రజలను మభ్య పెడుతున్నాడనీ కేంద్ర మాజీ మంత్రి, డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని 16, 17, 26, 27 వార్డుల్లో కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ డోన్ నియోజకవర్గంలో రూ.2,500 కోట్లతో అభివృద్ధి చేశానని మంత్రి బుగ్గన గొప్పలు చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. డోన్ నియోజకవర్గంలో కోట్ల, కేఈ కుటుంబాలే ప్రజలకు అభివృద్ధి చేశాయని తెలిపారు. డోన్‌లో ఎన్నో కాలనీలు ఏర్పాటు చేసి పేదలకు వేల ఇళ్ల పట్టాలు ఇచ్చామన్నారు. కోట్ల సుజాతమ్మ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే రూ.52 కోట్లతో డోన్ ప్రజలకు శుద్ధ జలం అందించామన్నారు. తాము వేసిన తారు రోడ్లకు, కట్టించిన వాటర్ ట్యాంకులకు రంగులు వేసి తానేదో అభివృద్ధి చేసినట్లు బుగ్గన చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. బుగ్గన అభివృద్ధంతా కాంట్రాక్టర్లకే పరిమితమైందని, ప్రజలకు జరిగిన మేలు ఏమీ లేదన్నారు. బుగ్గన ఏమి చెప్పినా ఇక ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. రాష్ట్ర ప్రజలు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని గెలిపించడం ఖాయమని, డోన్‌లో టీడీపీ జెండాను ఎగురవేస్తామని కోట్ల ఉద్ఘాటించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కోట్రికే ఫణిరాజ్, వలసల రామక్రిష్ణ, డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ లక్ష్మిరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ టీఈ కేశన్నగౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, మాజీ సర్పంచ్ కేశవయ్యగౌడు, కోట్ల గిరిదర్ రెడ్డి, చిట్యాల మద్దయ్యగౌడు, శ్రీనివాస్‌భట్, మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాసులు యాదవ్, భాస్కర్‌నాయుడు, పాలరాజు, చంద్రపల్లి ఆచారి, మర్రిమణి, సుధీష్, కేఈ శ్యాం, ఎస్ఎండీ రఫి, అన్వర్‌బాషా, ఎల్లగౌడు, పుల్లయ్యగౌడు, జయరాముడు, ఖాజా, యేసు, బీజేపీ నాయకులు వడ్డె మహా రాజు, హేమసుందర్‌రెడ్డి, జనసేన నాయకులు పాలమోహన్‌రెడ్డి, బ్రహ్మం తదితరులు ఉన్నారు.

● కోట్ల కూతుళ్ల ప్రచారం:

డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి కూతుళ్లు కోట్ల నివేదిత, కోట్ల చిత్రమ్మ ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తండ్రి కోట్లతో కలిసి కూతుళ్లు ఇంటింటికి తిరిగి టీడీపీని గెలిపించాలని అభ్యర్థించారు. కోట్ల కుటుంబాన్ని ఆశీర్వదించాలని ప్రజలతో మమేకమవుతూ విజ్ఞప్తి చేశారు.

టీడీపీతోనే రాష్ట్ర అభివృద్ధి

బేతంచెర్ల, మార్చి 17: రాబోవు ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని ప్రజలు ఆదరించి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకుంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని టీడీపీ మండల అధ్యక్షులు ఉన్నం ఎల్ల నాగయ్య అన్నారు. ఆదివారం సిమెంటునగర్‌లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు సీపీ రాముడు, యూనిట్ ఇన్‌చార్జి బూత్ ఇన్‌చార్జిలు వాసు, వెంకటేశ్వర్లు, మహబూబ్ సుభాన్, నూర్ అహ్మద్, ఆనంద్ పాల్గొన్నారు.

● రాష్ట్రంలో వైసీపీ రాక్షస పాలనకు అంతం పలికి స్వర్ణ యుగానికి నాంది పలకాలని టీడీపీ మండల కన్వీనర్ ఉన్నం ఎల్ల నాగయ్య అన్నారు. ఆదివారం మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. డోన్ అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ముస్లిం మైనార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ జాకీరుల్లా భేగ్, కౌన్సిలర్ రామాంజనేయులు, ఫయాజ్, మురళి, పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు టైలర్ రాముడు, రాధాకృష్ణ, రామస్వామి, లొద్ద శేఖర్, కమలపాటి వెంకటరాముడు, శివనారాయణ, గుడిసె మద్దిలేటి స్వామి పాల్గొన్నారు.

బలిజలను గుర్తించిన పార్టీకే మద్దతు

నంద్యాల,మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : వచ్చే ఎన్నికల్లో బలిజ సంఘీయులను గుర్తించిన పార్టీకే సంపూర్ణ మద్దతు ఉంటుందని అహోబిలం బలిజ సంఘీయుల అన్నదాన సత్రం అధ్యక్షుడు శెట్టి విజయకుమార్ ఆదివారం స్పష్టం చేశారు. అహోబిలంలో జరుగుతున్న బ్రహ్మోత్సవ పూజల్లో పాల్గొన్న అనంతరం తాలుకా బలిజ సంఘీయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలు ఓట్ల కోసం ఇచ్చే డబ్బులకు సంఘీయులు అమ్ముడు పోరాదని, ఏ పార్టీ అయితే బలిజ సంఘీయులను గుర్తించి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాధాన్యత కల్పించే వారికే మన ఓట్లు వేద్దామని ప్రతిజ్ఞ చేయించారు.

కేంద్రంలో ప్రజా వ్యతిరేక పాలన

● సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

డోన్(రూరల్), మార్చి 17: కేంద్రంలో, రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన నడుస్తుందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని కొత్తబస్టాండు సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో సీపీఐ నియోజకవర్గ జనరల్‌బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ముప్పల నాగేశ్వరరావు కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు విస్మరించిందని ధ్వజమెత్తారు. కార్పొరేట్ శక్తులకు ప్రయోజనాలు కలిగించే విధంగా కేంద్ర ప్రభుత్వ విధానాలు ఉన్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకయ్య, రాధాకృష్ణ, మండల కార్యదర్శి పులిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మూడు ఫ్లయింగ్ స్క్వాడ్స్ టీములు ఏర్పాటు

డోన్, మార్చి 17: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో డోన్ నియోజకవర్గంలో మూడు ఫ్లయింగ్ స్క్వాడ్స్ టీములను ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్ నియమావళి ప్రవర్తన, రాజకీయ పార్టీల ప్రచారాల వ్యవహార శైలిని ఫ్లయింగ్ స్క్వాడ్ టీములు పర్యవేక్షించనున్నాయి. నియోజకవర్గంలోని డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలానికి ఒక్కో ఫ్లయింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేసినట్లు ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మాధవకృష్ణరెడ్డి తెలిపారు. ఒక్కో ఫ్లయింగ్ స్క్వాడ్ టీములో 9 మందిని నియమించారు. మూడు షిఫ్టులుగా 8 గంటల చొప్పున మూడు షిఫ్టుల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ టీములు పని చేయనున్నాయి.

● మూడు చెక్‌పోస్టులు ఏర్పాటు :

డోన్ నియోజకవర్గంలో ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేసేందుకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి మహేశ్వరరెడ్డి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మాధవకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మూడు చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తున్నారు. డోన్ మండలంలోని జగదుర్తి హైవే వద్ద ఒక చెక్‌పోస్టు, ప్యాపిలి మండలంలోని పోదొడ్డి హైవే వద్ద మరో చెక్‌పోస్టును ఏర్పాటు చేస్తున్నారు. డోన్ సమీపంలోని కొట్లవారిపల్లి కూడలి లేదా కొచ్చెర్వు చిగురుమానుపేట జంక్షన్ రాయలచెరువు రోడ్డులో ఒక చెక్‌పోస్టును ఏర్పాటు చేయనున్నారు. రెండింటిలో ఎక్కడ చెక్‌పోస్టు ఏర్పాటు చేయాలనేది నిర్ణయించాల్సి ఉందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి తెలిపారు.

'టీడీపీని గెలిపించండి'

ఆళ్లగడ్డ, మార్చి 17: వచ్చే ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి మాజీ మంత్రి అఖిలప్రియను గెలిపించాలని టీడీపీ యువ నాయకుడు విఖ్యాత్‌రెడ్డి కోరారు. ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని పి.చింతకుంట గ్రామంలో ఆదివారం బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించా రు. ఈ సందర్భంగా కరపత్రాలను పంపిణీ చేశారు. వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు.